బకాయిలను విడుదల చేయాలి

అదనపు కలెక్టర్‌కు వినతి ఇస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, నవంబర్ 18 : జిల్లాలో చదువు తున్న బెస్ట్ అవేలబుల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థు లు 20నెలల స్కీం బకాయి లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కేవీపీఎస్, ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సీతా రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలం గాణ గిరిజన సంఘం, ఎస్ఫ్ఐ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శులు శంకర్ నాయక్, తారా సింగ్, కాశన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో సోషల్ వెల్ఫేర్, గిరి జనసంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవేలబుల్ స్కీం కింద 9వేల మంది దళితులు 6వేల మంది గిరిజన పిల్లలు చదువుకుంటున్నారన్నారు. ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా 175ఓట్లు చెల్లించకుండా దళితగిరిజన విద్యార్థులపై వివక్షత చూపుతున్నదని ఆరోపించారు. గత ప్రభుత్వం కొంతపెండింగ్‌లో ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తానికి ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి బకాయిపడ్డ రూ. 175 కోట్లు చెల్లించేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సుల్తాన్, శోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని ఆర్డీవోకు వినతి

కల్వకుర్తి, నవంబర్ 18 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతుభరోసా ఎకరాకు రూ.7,500 చెల్లించాలని, సన్నధాన్యం పాటు హంసకు కూడా రూ.500 ఇవ్వాలని డిమాండ్‌తో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు కల్వకుర్తి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చినహామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ రైతులను ఆదుకోవాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, ధర్మారెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

శ్రీశైలం.. భక్తశోభితం

శ్రీశైలంలో జనసందోహం

శ్రీశైలం, నవంబర్ 18 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున మహాపుణ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. కార్తీకమాసం సోమవారం పరమ శివుడి దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఉత్తర దక్షిణాది యాత్రికులు కూడా అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. తెల్లవారుజామున కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసుకుని కృష్ణమ్మకు పసుపు కుంకుమ సారెలు ఇచ్చి కార్తీక దీప దానాలు చేస్తున్నారు. అదేవిధంగా కార్తీక దీపాలను వెలిగించుకు నేందుకు భక్తులకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధిలో, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ప్రతిభక్తుడికి లడ్డూ ప్రసాదాలు అందేలా విక్రయ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యుద్దీపాకాంతులతో అలరారుతున్న ఆలయ శోభను వీక్షిసూ భక్తులు ఆధ్యాత్మిక ఆనంద పరవశులవుతున్నారు. భ్రమరాంబమల్లికార్జునుల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్త పూజలానంతరం పుష్కరిణివద్దకు వేంచేబు చేయించి ప్రత్యేక పుష్పాలంకరణతో లక్ష దీపార్చన నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర ఆజాద్ తెలిపారు. ప్రత్యేక ఆకర్షణగా చేసే దశవిద హారతులను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువగా క్షేత్రానికి వస్తున్నారని శ్రీశైలప్రభ సంపాదకుడు డాక్టర్ అనీల్ కుమార్ తెలిపారు.

సర్వేకు పారితోషికం చెల్లించాలి

డీఎంహెచ్‌వోకు వినతి అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

నాగర్‌కర్నూల్, నవంబర్ 18 : జిల్లా వ్యాప్తంగా వైద్యరంగంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు అదనపుసర్వేలకు డబ్బులు వెంటనే చెల్లించాలని, మిషన్ ఇంద్రధనుస్సు సర్వేకు మెటీరియల్ ఖర్చులు చెల్లించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి స్వరాజ్యలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గతంలో అనేక సర్వేలు నిర్వహించిన ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదని, కంటివెలుగు లెప్రసి సర్వే, పల్స్‌పోలియో, టీబీసర్వే నిర్వహించినా ప్రభుత్వం ఒక్కరూపాయి ఇవ్వక పోవడం దురదృష్టకమన్నారు. ప్రధానంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్నిరంగాల ఉద్యోగులతోపాటు ఆశ వర్కర్లకు కూడా ఎన్నికల డ్యూటీ విధులు నిర్వహిస్తే ఒక్క రూపాయలు తమ అకౌంట్‌లోకి వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంద్రధనుస్సు సర్వే పేరుతో జిరాక్స్ కాపీలకు, చాక్‌పీస్‌లకు కూడా డబ్బులు మీరే పెట్టుకోవాలని అధికారులు చెప్పడం సరైన నిర్ణయం కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, సహాయకార్యదర్శి రామయ్య, ఆశ వర్కర్లు మంగమ్మ, రాధ, యాదమ్మ, రాజేశ్వరి, రాణి పాల్గొన్నారు.

ముక్కిడిగుండానికి రహదారి ఏర్పాటు చేయాలి

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 18 : మండల కేంద్రం నుంచి నల్లమల అటవి ప్రాంతానికి ఆనుకొని ఉన్న ముక్కిడిగుండానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం కార్యదర్శి అశోక్‌నాయక్, గ్రామస్తులు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశోక్ మాట్లాడుతూ కుడికిళ్ల నుంచి నార్లాపూర్, ముక్కిడిగుండం పెద్దవాగు వరకు పూర్తిగా రోడ్డుసౌకర్యం సరిగా లేదన్నారు. రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న కుడికిళ్ల, నార్లాపూర్ మధ్యకాల్వలు ఉండడం భారీవాహనాలు తిరగడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, విద్యార్థినులు రవాణా బస్సుసౌకర్యం లేక ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించలేక ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే రహదారిని నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పర్వతాలు, రాముడు, సేవ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ సీతారామారావు

కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, నవంబర్ 18 : ప్రజావాణి ద్వారా కలెక్టరేట్ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సీతారామారావు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 39 ఫిర్యాదులు అందాయి. అదనపుకలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు సమస్యలపై ఫిర్యాదులు అందించారని వాటి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్‌లోఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 9 ఫిర్యాదులు:

జిల్లా పోలీస్ కార్యాలయానికి సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 9 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి ఆయా ఫిర్యాదుదారుల ప్రాంతాల పోలీస్ అధికారులను ఆదేశించారు. న్యాయం చేయాలంటూ మూడు, భూమి పంచాయతీకి సంబంధించి ఐదు, భార్యాభర్తల పంచాయతీకి సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్లు ఎస్పీ తెలిపారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబర్ 18 : జిల్లా కేంద్రంలోని గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సంతోష్ సోమవారం పరిశీలించారు. టీజీపీఎస్‌సీ నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ కలెక్టర్ తన సెల్‌ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అదేవిధంగా పరీక్షా కేంద్రం లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. పట్టణంలోని సైన్స్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరు ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని పరీక్షా కేంద్రాల్లో సజావుగా జరిగేందుకుని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష పూర్తయ్యేవరకు అభ్యర్థులను బయటికి పంపవద్దని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్ష

బిజినేపల్లి, నవంబర్ 18 : మండల కేంద్రం తోపాటు మండలంలోని పాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలతోపాటు పాలెంలో వ్యవసాయ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షను ప్రశాంతంగా జరిపించారు. పరీక్షలకు ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

జిల్లాకేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ముగిసిన గ్రూప్-3 పరీక్ష

- రెండోరోజు 4,432 మంది గైర్హాజరు

నాగర్‌కర్నూల్, నవంబర్ 18: గ్రూప్-3 పరీక్ష సోమవారంతో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 9,478మంది అభ్యర్థులకు గానూ జిల్లాకేంద్రం తోపాటు తెలకపల్లి, బిజినేపల్లి మండలాల్లో 33పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండో రోజు ఉదయం సమయంలో నిర్వహించిన పరీక్షకు 5,042 మంది హాజరుకాగా, 4,436 మంది గైర్హాజర య్యారు. రెండోరోజు సైతం వేల సంఖ్యలో అభ్యర్థులు గైర్హాజరు కావడంతో కేవలం 53.20శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు నిర్ధారించారు. నెల్లికొండ చౌరస్తాలో సైన్స్ డిగ్రీ కళాశాల, స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను కలెక్టర్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా గతంలో ఎప్పుడూ లేనంతగా ఈసారి నిర్వహించిన గ్రూప్-3కి అభ్యర్థులు వేలసంఖ్యలో గైర్హాజరు కావడం విశేషం.

మొబైల్ మెడికల్‌యూనిట్లలో దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, నవంబర్ 18 : జిల్లాలోని మొబైల్ మెడికల్ యూనిట్ (పీఎం జెన్‌మాన్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక సంవత్సరం పాటు పనిచేయడానికి నిర్దిష్ట పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి స్వరాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. 5 మెడికల్ ఆఫీసర్లు, 5 స్టాఫ్‌నర్సు, 5 ల్యాబ్ టెక్నీషియన్, 5 పారామెడికల్‌కమ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు స్వయంగా అటెస్ట్‌చేసిన అన్నిసర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలను www.nagarkurnool.telangana. gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

శుద్ధజలం ప్లాంటు ఏర్పాటు చేస్తాం

చారకొండ, నవంబర్ 18 : మండలంలోని జూపల్లిలో ప్రాథమిక పాఠశాలలో శుద్ధజలం ప్లాంటు ఏర్పాటు చేస్తానని వెల్దండ సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు అన్నారు. సోమవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శుద్ధజలం ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరగా సొంత ఖర్చులతో రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తానని హామీఇచ్చారు. ఆయ నవెంట మాజీసర్పంచ్ సాయికుమార్ పాల్గొన్నారు.

50శాతం సర్వే పూర్తి

బల్మూరు, నవంబర్ 18 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటి సమగ్ర సర్వే మండలంలో ఇప్పటి వరకు 50 శాతం పూర్తికావడం జరిగిందని ఎంపీడీవో రాఘువులు సోమవారం తెలిపారు. గ్రామాల్లో సర్వే అధికారులకు ప్రజలు సహకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలు, అందరు బాధ్యతగా సర్వే అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు. ప్రజలు, యువకులు తదితరలు అధికారులకు అన్నివిధాలా సహకరించాలని ఆయన కోరారు.

డీ కంపోజింగ్ తయారీ ఉపయోగంపై అవగాహన

వరిపంట అవశేషాల ఉపయోగాలను వివరిస్తున్న ఏఈవో సీతారాం

అమ్రాబాద్, నవంబర్ 18 : మండలంలోని మన్ననూర్‌లో వరి కొయ్యల అవశేషాలను కుళ్లింపజేసే (డీ కంపోజ్) తయారీపై మండల వ్యవసాయ విస్తరణ అధికారి సీతారాం సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. వరికొయ్యల అవశేషాలను కుళ్లింపజేయడానికి ఎస్ఎ న్ఫి(సింగిల్ సూపర్ ఫాస్ఫేట్)ను ఎకరానికి 50కిలోల ఎస్ఎస్పీ, 10-15 కిలోల యూరియా వరి కొయ్యల అవశేషాలపై చల్లాలని, నీరు తడి ద్వారా డీకంపోజింగ్ వేగవంతం చేయాలన్నారు. వరి అవశేషాలను రోటా మేర్ ద్వారా మట్టిలో కలియ దున్ని పోషకాలను విడుదల చేయాలని తెలిపారు. 20-30 రోజుల్లో కొయ్యలు అవశేషాలు పూర్తిగా కుళ్లి పోతాయని ఆయన తెలిపారు. ఫాస్పరస్, సల్ఫర్ పంటలకు ఉపయోగకరంగా మారుతాయని పోషకాలను అందుబాటులోకి తీసుకువస్తాయన్నారు. మట్టిలో జీవనత్వం పెరిగి ఉత్పాదకత మెరుగవుతుందని రసాయన ఎరువుట అవసరం తగ్గుతుందని ఖర్చు తగ్గుతుందని పంటల అవశేషాల దహనాన్ని తగ్గించడం ద్వారా వాయుకాలుష్యం తగ్గుతుందని ఈ సందర్భంగా రైతులకు వివరించారు. పంట అవశేషాలను కాల్చకూడదని ఎస్ఎస్పీ, యూరియా ఉపయోగించి డీకంపోజ్ చేసుకోవాలని ఇవి మట్టిని పుష్కలంగా చేస్తుందని తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని భవిష్యత్తు పంటల దిగుబడి పెంచుతుందని పలు సూచనలు చేశారు.

హాస్టల్‌వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ నాయకులు

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 18: జిల్లాకేంద్రంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండీ సయ్యద్, తారాసింగ్‌లు మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో ఉన్న ఎస్సీ-ఏ హాస్టల్‌కు ఇన్‌చార్జి ఉండడంవల్ల సరిగా రావడం లేదన్నారు. అదేవిధంగా బియ్యం, చింతపండు, నూనె విద్యార్థులకు ఇవ్వాల్సిన దుప్పట్లు నోటుబుక్స్‌ను బయటకు వ్యక్తులకు అమ్ముకుంటున్నారని, ఆల్కాహాల్ సేవిస్తున్నారని వారన్నారు. కావున తక్షణమే అతడిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకుడు సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో భక్తుల రద్దీ

ఉమామహేశ్వరంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

అచ్చంపేట రూరల్, నవంబర్ 18 : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు ఉమా మహేశ్వరాల యానికి భక్తుల రద్దీ పెరిగింది. కుటుంబసమేతంగా ఆలయానికి చేరుకొని దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావులు తెలిపారు. అదేవిధంగా నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తుల విరాళాల పరంపర కొనసాగుతున్నది. ఉప్పునుంతల మాజీ జెడ్పీటీసీ అనంత సరిత, రాజు దంపతులు, కుటుంబసభ్యులు ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించి తమవంతుగా నిత్యాన్నదానానికి రూ. 25వేలు విరాళం అందజేశారు. వారికి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పవన్, దశరథం, సైదులు, అర్చకులు వీరయ్యశాస్త్రి పాల్గొన్నారు.

తాగునీరు రావడం లేదని వినతి

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 18 : మండలంలో ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఏఈఈ వినతిపత్రం అందజేశారు. మండలంలోని అనేక గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతిరోజూ మంచినీటి సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నూతన ఈవోగా బాధ్యతలు చేపడుతున్న చంద్రశేఖర్ ఆజాద్

టీటీడీ తరహాలో శ్రీశైలం క్షేత్రాభివృద్ధి చేస్తాం

- ఈవో చంద్రశేఖర్ ఆజాద్

శ్రీశైలం, నవంబర్ 18 : శ్రీశైల దేవస్థానాన్ని టీటీడీ తరహాలో అభివృద్ధి చేస్తామని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. సోమవారం నూతన ఈవోగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పరిపాలనా భవనంలో అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వామి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ఉన్నతాధికారుల సూచనలతో, ఆలయ సిబ్బంది సహకారంతో క్షేత్రాభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది జవాబుదారితనంతో పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ దేవస్థాన అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

హైదరాబాద్‌లో సాయిలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్, నవంబర్ 18 : మండలంలోని సింగారం చెందిన రిటైర్డ్ టీచర్ సల్వాదిసాయిలు అనారోగ్యంతో కొన్ని రోజులుగా బాధపడుతూ హైద్రాబాద్‌లోని ఓ ప్రైవైట్ దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దవాఖానకు వెళ్లి బాధితుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

లింగాల, నవంబర్ 18 : ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని నిబంధనల ప్రకారం విద్యార్థులకు అందించాలని మండల విద్యాధికారి బషీర్‌అహ్మద్ అన్నారు. సోమవారం మండలంలోని మానాజిపేట, రాంపూర్, వల్ల భావుల్ గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కులగణ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

చారకొండ, నవంబర్ 18 : మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం బాలచందర్, స్త్రీనిధి మేనేజర్ శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో ఇందిరా మహిళాశక్తిలో అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యమ్మ, కార్యదర్శి అలివేలు, కోశాధికారి నిర్మల, సీసీలు విమల, మాధవి పాల్గొన్నారు.

మొక్కలపెంపకం సకాలంలో పూర్తిచేయాలి

వెల్దండ, నవంబర్ 18 : ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రతి గ్రామంలో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని జాతీయ ఉపాధిహామీ పథకం ఏపీవో ఈశ్వర్‌జీ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మినోనిపల్లిలో మొక్కల పెంపకంలో భాగంగా బ్యాగుల్లో మట్టి నింపడాన్ని ఆయన పరిశీలించారు. మొక్కలను జాగ్రత్తగా పెంచి సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో టీఏ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచాలి

బల్మూరు, నవంబర్ 18 : రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచాలని బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశన్నయాదవ్ వినతి పత్రాన్ని రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు సోమవారం అందజేశారు. గత ప్రభుత్వాలు బీసీలకు లోకల్‌బాడీ ఎన్నికల్లో పూర్తిగా రిజర్వేషన్ తగ్గించి అగ్రకులాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. బీసీలకు జనాభ ప్రతిపాదికంగానే అంటే దాదాపు 70శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆయన కోరారు.

దివ్యాంగుల దినోత్సవం నిర్వహించాలి

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 18 : మండలాల్లో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రతి సంవత్సరం డిసెంబరు2వ తేదీన నిర్వహించే దివ్యాంగుల దినోత్సవాన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జరపాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, ప్రధానకార్యదర్శి బాలీశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు స్వామి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పునుంతల, నవంబర్ 18 : ఈ నెల 15,16,17 తేదీల్లో అండర్-17 బాలుర, బాలికల 68వ చాంపియన్షిప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తాండూర్‌లో జరిగిన పోటీలకు వెల్టూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులు వారిని ఘనంగా సన్మానించారు. పాఠశాలకు చెందిన విద్యార్థి గణేష్, భార్గవి పోటీల్లో పాల్గొనడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవిశేఖర్, ఉపాధ్యాయులు జంగయ్య, సురేందర్, వెంకటయ్య, రాజేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పశుగణన

తాడూరు, నవంబర్ 18 : మండలంలో పశుగణన లెక్కింపు ప్రక్రియ ప్రారంభ మైనట్లు పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలో సోమవారం భారత్ పశుధన్‌యాప్‌లో రైతుల పశుసంపద వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో వీఏఎస్ లక్ష్మీ, వీఎల్‌వో రమేశ్, జేవీవో జానయ్య, ఎల్ఎస్ఏ సల్మా, వీఏ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణనను లెక్కిస్తున్న పశువైద్యాధికారులు